# పొదుపు

బి.హెచ్.వి.నాగేశ్వరరావు

**ఈ**జీఛైర్‌లో వెనక్కి వాలి కూర్చుని తన లేడీ సెక్రటరీతో కులాసాగా కబుర్లు చెబుతున్న ఒకానొక ప్రభుత్వ సంస్థాధినేతకు హఠాత్తుగా తన సంస్థలో అనవసరపు ఖర్చులు తగ్గించాలన్న ఆలోచన కలిగింది. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా? ఆలోచన రావడమే తరువాయి తన స్టెనోని పిలిపించి తన ఆధీనంలోని బ్రాంచ్ ఆఫీసులన్నింటికీ అనవసర వ్యయాన్ని తక్షణమే తగ్గించాలని, లేకుంటే కఠినచర్య తప్పవని హెచ్చరిస్తూ ఒక సర్క్యులర్ జారీ చేయించారు.

అనవసరపు ఖర్చులు ఎలా తగ్గిస్తున్నదీ వివరిస్తూ నెలనెలా నివేదికలు పంపించాలని కట్టడి చేసారు. ఆ నివేదికలను పరిశీలించడానికి ఒక అధికారిని నియోగించారు. ఆ అధికారికి సహకరించడానికి ఒక స్టెనోని, కొందరు గుమస్తాలను ఏర్పాటు చేసాడు. అంతేకాదు, తానే స్వయంగా ప్రతి బ్రాంచీ ఆఫీసునీ విజిట్ చేసి అనవసరపు ఖర్చుల్ని ఎలా తగ్గిస్తున్నదీ పరిశీలించబోతున్నట్లు ప్రకటించారు. బ్రాంచ్ ఆఫీసుల్ని తన దైనశైలిలో నడిపిస్తున్న సిబ్బంది బిగ్‌బాస్ విజిట్ అనగానే ఉలిక్కిపడ్డారు. బిగ్‌బాస్ వస్తున్నాడంటే సామాన్యమైన విషయం కాదు. బాస్‌ని రిసీవ్ చేసుకోవడం నుంచి మరలా సెండాఫ్ ఇచ్చేవరకూ విపరీతమైన టెన్షన్ ఉంటుంది మరి.




సర్క్యులర్‌లో ప్రకటించిన విధంగా బిగ్‌బాస్ బ్రాంచ్ ఆఫీసుల విజిట్ మొదలుపెట్టారు. నెలకి మూడు నాలుగు బ్రాంచీల విజిట్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. బ్రాంచ్ ఆఫీసుల సిబ్బంది బిగ్‌బాస్‌కి, అతని పరివారానికి తగినరీతిలో స్వాగత సత్కారాలు ఏర్పాటు చేసారు. అనవసరపు ఖర్చులు తగ్గిస్తున్నట్లు లెక్కలు వేసి చూపించారు. బిగ్‌బాస్ ఆ లెక్కల్ని చూసి సంతోషంగా తల పంకించాడు. తను సర్క్యులర్ ఇవ్వడంవల్లేకదా అనవసరపు ఖర్చుల్ని తగ్గించాలన్న చైతన్యం అందరిలో తీసుకురాగలిగారు. సంతృప్తితో కూడిన చిరునవ్వు అతని ముఖంపై విరిసింది.

ఏడాదిలో అన్ని బ్రాంచీల విజిట్ పూర్తి చేసుకుని తిరిగి తన ఏసీ రూములో ఈజీఛైర్‌లో విశ్రాంతిగా వాలేసరికి ఒక మంచి పనిని సాధించిన ఆనందం కలిగింది ఆయనకు. తలుపు తోసుకుని అతని సెక్రటరీ గదిలోకి వచ్చింది. బిగ్‌బాస్‌కి విష్ చేసి తన చేతిలోని మూడుఫైళ్ళను అతని పరిశీలనకై టేబుల్‌పై వుంచింది.

మొదటి ఫైల్‌ను తెరిచాడాయన. దానినిండా వివిధ ప్రభుత్వ శాఖాధిపతులు, ఉన్నతాధికారులు పంపిన అభినందన పత్రాలున్నాయి. అనవసరపు ఖర్చులు తగ్గించాలన్న ఒక గొప్ప ఆశయాన్ని తన ముందుంచుకుని ఒక సంవత్సరంపాటు ఆ దిశగా పరిశ్రమించినందుకు అతన్ని అభినందిస్తూ పంపిన ఉత్తరాలవి. వాటిని పరిశీలించిన బిగ్‌బాస్ ఛాతీ గర్వంతో ఉప్పొంగింది. రెండవ ఫైల్ తెరిచాడు. వివిధ బ్రాంచి ఆఫీసులు ఖర్చుల్ని ఎలా తగ్గించిందీ వివరిస్తూ పంపించిన నివేదికల సారాంశాన్ని నియమిత అధికారి బిగ్‌బాస్ పరిశీలన నిమిత్తం పంపించాడు.

బిగ్‌బాస్ సర్క్యులర్‌వల్ల గత ఏడాదిలో అన్ని బ్రాంచీలలో కలిపి ఇంచుమించు యాభైవేల రూపాయలవరకు అనవసరపు ఖర్చులు తగ్గినట్లు వివిధ బ్రాంచీలు పంపిన నివేదికల సారాంశం అది. దానిపై సంతృప్తిగా సంతకం చేసాడాయన.

మూడవ ఫైల్ తీసాడాయన. బ్రాంచీల నివేదికల పరిశీలనకు నియోగించబడిన అధికారి, సిబ్బంది జీతభత్యాలకు, ఖర్చులకు, బిగ్‌బాస్ విజిట్లకు అయిన ఖర్చు ఐదులక్షలు శాంక్షన్ చేయమనే నోట్ అది.

ఆ నోట్‌పై అప్రూవ్డ్ అని రాసి సంతకం చేసి, ఆ అమౌంట్ ఐదులక్షలనూ శాంక్షన్ చేస్తూ 'ఒక మంచి పని చేయాలంటే ఖర్చవుతుంది మరి' అనుకున్నాడు బిగ్‌బాస్.

★